నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, గురువారం 30 జనవరి 2025 | MAHABUBABAD

## ఆత్మీయ భరోసా వర్తింపజేయాలి

**– పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ**

నగర విలీన గ్రామాల రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపచేయాలి. లక్షలాది మంది భరోసా అందక నష్టపోతున్నారు. నగర రైతు కూలీలకు భరోసా అమలు చేసే వరకు పోరాడుతాం. కాంగ్రెస్ పాలక వర్గం నగరాభివృద్ధికి చేసిందేమీ లేదు. కౌన్సిల్ సమావేశం సీఎం రేవంత్‌రెడ్డిపై పొగడ్తలకే సరిపోయింది. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు ప్రొటోకాల్ పాటించకుండా అధికారులు అవమానిస్తున్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే ఊరుకోం. విపక్ష కార్పొరేటర్ల డివిజన్లకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతున్నారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో పోరాడుతాం.



సమావేశానికి హాజరైన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సారయ్య, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు

# నగర రైతు కూలీలకూ భరోసా ఇవ్వాలి

- గ్రేటర్ కౌన్సిల్ సమావేశంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల ప్రతిపాదన
- ఎజెండా అంశాలకు ముందే తీర్మానం చేయాలని పట్టు
- పోడియం వద్దకు దూసుకెళ్లి ప్లకార్డులతో నిరసన
- నినాదాలు, బైఠాయింపుతో రసాభాసగా సభ

వరంగల్, జనవరి 29 : విలీన గ్రామాల రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలన్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల తీర్మానానికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపింది. బుధవారం మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగిన బల్దియా సమావేశం నిరసనలు, నినాదాలు, బైఠాయింపులతో రసాభాసగా మారింది. సమావేశం ప్రారంభం కాగానే బీఆర్‌ఎస్ పక్షాన కార్పొరేటర్లు నగర రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపచేయాలన్న తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఎజెండా అంశాలకు ముందే అమోదించాలని డిమాండ్ చేశారు. ఎజెండా అంశాల తర్వాత ఆమోదం తెలుపుతామని మేయర్ చెప్పడంతో కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. పోడియం వద్దకు దూసుకుపోయి, అక్కడే బైఠాయించి మేయర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తీర్మానం అమోదించిన తర్వాతే ఎజెండా అంశాలు కౌన్సిల్ ముందుకు తీసుకురావాలని పట్టుపట్టారు. చివరికి ఎజెండా అంశాల తర్వాత తీర్మానానికి కౌన్సిల్ ఆమోదం తెలపడంతో పాటు ప్రభుత్వానికి పంపిస్తామని సమావేశంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్లకు నిధుల కేటాయింపుల్లోనూ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఈ సమయంలోనే ఎన్నికల కోడ్ వచ్చిందన్న సమాచారం మేరకు సమావేశాన్ని ముగించారు. అంతకు ముందు సమావేశం మధ్యలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలిపారు. ప్రారంభంలోనే సంతాపం ప్రకటించాల్సిన పాలకవర్గం మేయర్ ప్రసంగం తర్వాత తీర్మానం పెట్టి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అయితే కాంగ్రెస్‌కు చెందిన మాజీ ప్రధానికి సమావేశం మధ్యలో ఆ పార్టీ పాలకవర్గం సంతాపం తెలిపి అవమానించిందని పలువురు కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

### 23 ఎజెండా అంశాలకు ఆమోదం

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం ముందుకు వచ్చిన 23 ఎజెండా అంశాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. నగరంలో చేపట్టనున్న రూ. 65.80 కోట్ల అభివృద్ధి పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. ముఖ్యంగా నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ. 4,170 కోట్ల అంచనాలతో రూపొందించిన డీపీఆర్‌కు పరిపాలన అనుమతులిచ్చారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో స్వచ్ఛ ఆటోల కొనుగోళ్లు, కాశిబుగ్గ, కాజీపేట సర్కిళ్ల పరిధిలో బయో మైనింగ్ ప్రాసెస్ యూనిట్ల ఏర్పాటును ఆమోదించారు. సప్లిమెంటరీ ఎజెండాలో నిట్ నుంచి అదాలత్ వరకు ఉన్న ప్రధాన రహదారి పేరును రెడ్ క్రాస్ మార్గ్‌గా మార్చడానికి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించేందుకు, వర్క్ కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న 452 మంది పారిశుద్ధ్య కార్మికుల వేతనాన్ని రూ. 16,600కు, కార్పొరేషన్ భారీ వాహనాలు నడుపుతున్న ఔట్ సోర్సింగ్ డ్రైవర్లు, డిప్యుటేషన్‌పై డ్రైవర్లుగా పనిచేస్తున్న వారి వేతనాలు రూ. 20,500కు పెంచుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించేందుకు ఆమోదించారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు


## రైతుభరోసా లేదు..

పంటల పెట్టుబడి ఖర్చుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. ఏడాదికి ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతులకు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని రైతు భరోసా అని పేరు మార్చి ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పింది. తర్వాత రూ.12 వేలకు తగ్గించింది. ఏడాదిగా పథకాన్ని పక్కనబెట్టింది. జనవరి 26 నుంచి అమలు చేస్తామని ప్రకటించింది. మండలంలోని ఒక గ్రామంలో మాత్రమే ఈ పథకం అమలవుతున్నది. బీఆర్‌ఎస్ హయాంలో ఉమ్మడి జిల్లాలోని 8,77,173 మంది రైతులకు రైతుబంధు పథకం వర్తించేది. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.880 కోట్లు పెట్టుబడి సాయం కోసం రైతుల బ్యాంకు అకౌంట్లలో ప్రభుత్వం జమచేసేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సాయం అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో 1705 గ్రామాలు ఉంటే ఇటీవల ప్రారంభించిన రైతు భరోసా కింద 71 గ్రామాల్లోని ఈ పథకం అమలవుతున్నది. 10శాతం మంది రైతులకు సైతం ఈ సాయం అందడం లేదు.

# అన్నదాతకు అండగా..

## కదిలివస్తున్న బీఆర్‌ఎస్ అధ్యయన కమిటీ

## నేడు వరంగల్ జిల్లా పల్లారుగూడకు రాక



*కేసీఆర్ హయాంలో పండుగలా సాగిన వ్యవసాయంతో రంది లేకుండా ఉన్న రైతుల పరిస్థితి రేవంత్ సర్కారు రాకతో తలకిందులైంది. సరిపడా అందని సాగునీళ్లు, కరెంటు కోతలు, పెట్టుబడికి ఇబ్బందులు, కొందరికే రుణమాఫీ, వడ్లకు బోనస్.. ఇలా ఏ ఒక్కటీ సరిగ్గా అందకపోవడంతో ఆగమవుతున్నది. పంట పండించడం ఒక్కటే తెలిసిన రైతుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా లేకపోవడంతో రైతులు అన్ని దశల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతు సంక్షేమ అని చెప్పడమే తప్ప అమలుచేయకపోవడంతో ముందుకు సాగలేక పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు భారమై తనువు చాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతుల బలవన్మరణాలపై అధ్యయనం చేసి బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు బీఆర్‌ఎస్ కదలివస్తోంది. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో గురువారం వరంగల్ జిల్లా సంగెం మండలం పల్లారుగూడలో పర్యటించి భరోసా కల్పించనున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యవసాయరంగంలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులను సమగ్రంగా తెలుసుకొని రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నది.*

*- వరంగల్, జనవరి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

- ఆత్మహత్య చేసుకున్న పరిస్థితులపై అధ్యయనం
- రైతులతో ముఖాముఖి నిర్వహించనున్న కమిటీ
- కాంగ్రెస్ హయాంలో అన్నదాతల ఇబ్బందులు
- రాష్ట్రంలో తిరోగమనంలో వ్యవసాయం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం తరహాలో సర్కారు నుంచి రైతులకు అందాల్సినవి, హక్కుగా చెందాల్సినవీ ప్రస్తుతం ఒక్కటీ అమలు కావడం లేదు. సాగులో తలెత్తే ఇబ్బందులతో కొందరు రైతుల పరిస్థితి ఆగమవుతున్నది. సర్కారు అండ లేకపోవడంతో పంట పెట్టుబడి కోసం వ్యాపారుల దగ్గర తెచ్చిన అప్పు ప్రాణాలకు ముప్పు తెస్తున్నది. ప్రభుత్వం నుంచి భరోసా లేక ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. పంట పండించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి మద్దతు లేక బలవన్మరణాలకు పాల్పడుతున్న రైతుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు బీఆర్‌ఎస్ కదలివస్తున్నది. రైతు ఆత్మహత్యలు, వ్యవసాయరంగంలో ప్రస్తుతం నెలకొన్న ప్రతికూల పరిస్థితులపై అధ్యయనం కోసం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం మేరకు కమిటీ ఏర్పాటైంది. రాష్ట్రంలోని రైతులు, సాగు పరిస్థితులపై ఈ కమిటీ అధ్యయనం చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ మంత్రికి, వ్యవసాయ కమిషన్‌కు, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు ఈ కమిటీ నివేదికను అందించనున్నది.

**సాగు అంతంతే..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఒక సీజన్‌లో సగటున 14.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. సాగునీటి నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, రైతులకు సర్కారు పరంగా అందించే పెటుబడి సాయం(రైతుబంధు)ను ప్రస్తుత ప్రభుత్వం ఏడాదిగా నిలిపివేయడంతో సాగు విస్తీర్ణం తగ్గుతున్నది. వానాకాలంలోనూ ఉమ్మడి జిల్లాలో 13 లక్షలకు మించి సాగు కావడం లేదు. పత్తి, మిరప, వరి పంటల సాగులో ఉమ్మడి వరంగల్ జిల్లా ముందుండేది. ప్రభుత్వ పరంగా సహకారం లేకపోవడంతో ఏడాదిగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సాగులో ఇబ్బందులు పెరుగుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలోని పరిస్థితులు మళ్లీ వస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడంతో దిక్కులేని పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుల కోసం ప్రకటించిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదు. రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, సమయానికి ఎరువులు, నిరంతర కరెంట్, పంటల కొనుగోళ్లు, వడ్లకు కింటాకు రూ.500 బోనస్ మాటలకే పరిమితమయ్యాయి.

**బోనస్ లేదు..**

వరి పండించిన రైతులక ప్రోత్సాహకంగా వడ్లకు కింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. వానాకాలం పంటకు అమలు చేస్తున్నట్లు చెప్పింది. పంట అమ్ముకున్న రైతులు బోనస్ కోసం నెలలుగా ఎదురుచూస్తున్నారు. వరి పంటలకు కనీస మద్దతు ధర కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నది. వానాకాలం, యాసంగి కలిపి ఏటా రూ.300 కోట్లతో లక్షన్నర మేరకు వ్యాపారం జరుగుతున్నది. సగటున 2.80 లక్షల మంది రైతులు కొనుగోలు కేంద్రాల్లో వడ్లను అమ్ముతున్నారు. సన్నవడ్లకు మాత్రమే బోనస్ అనే సాకు చూపి రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ మంది రైతులకు అన్యాయం చేసింది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో సన్న వడ్లు పండించిన 52,186 మంది రైతులకు రావాల్సిన రూ.96 కోట్ల బోనస్ పెండింగ్‌లోనే ఉన్నది. ఈ బోనస్ ఎప్పటివరకు చెల్లిస్తారనేది ప్రభుత్వపరంగా, అధికారులలో ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదు. రైతుల ఆర్థిక ఇబ్బందులకు ఇదీ కారణమవుతున్నది.

### లక్షల్లో రుణమాఫీ బాధితులు..

కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది జూలై 18న లక్ష రూపాయల లోపు పంట రుణాలను, జూలై 31న లక్ష రూపాయల నుంచి ఒకటిన్నర లక్షల రూపాయల రుణాలను, ఆగస్టు 15న లక్షన్నర రూపాయల నుంచి 2 లక్షల వరకు రుణాలను మాఫీ చేసినట్లు ప్రకటించింది. నవంబర్ 30న రూ.2 లక్షల్లోపు రుణాలు నూటికి నూరు శాతం రద్దు చేశామని ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల ముందు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కారు ఆ తర్వాత నిబంధనల పేరుతో మాట తప్పడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రైతులకు హామీ ఇచ్చిన పంట రుణాల మాఫీ పథకం అమలు అంతంత మాత్రంగానే ఉన్నది. గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా పంట రుణాలు మాఫీ అయిన రైతుల సంఖ్య, మాఫీ అయిన మొత్తం వివరాలను వ్యవసాయ శాఖ ఇప్పటికీ ప్రకటించడం లేదు. కుటుంబ నిర్ధారణ నిబంధనతో సగం మంది రైతులకు పంట రుణాలు మాఫీ కాలేదు. ఉమ్మడి జిల్లాలో 48,297 కుటుంబాలకు గాను 36,279 కుటుంబాల నిర్ధారణ పూర్తి చేశారు. ప్రభుత్వం ప్రకటించిన వాటిలో 25శాతం వరకు కుటుంబాలు మిగిలిపోయాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2.70 లక్షల మంది రైతులకు పంట రుణాలు మాఫీ కావాల్సి ఉండగా 40శాతానికి పైగా పెండింగ్‌లో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అరకొర రుణమాఫీతో రైతులకు ఆర్థిక కష్టాలు తొలగిపోవడం లేదు.

# విద్యార్థినులకు వేధింపులపై ఆగ్రహం

- ఉపాధ్యాయులను చితకబాదిన తల్లిదండ్రులు, గ్రామస్తులు
- బాలికల నుంచి వివరాలు సేకరించిన విచారణాధికారి అనితాదేవి




కీచక ఉపాధ్యాయుడిని చితకబాదుతున్న తల్లిదండ్రులు

తొర్రూరు, జనవరి 29: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాల గ్రామంలో ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నార ని తెలుసుకున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు స్కూల్‌ను ముట్టడించారు. ఈ విషయంపై బుధవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురించగా వారు పెద్ద సంఖ్యలో పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయులను నిలదీశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొందరు టీచర్లను చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లిదండ్రులు, గ్రామస్తులకు సర్దిచెప్పారు. ముగ్గురు టీచర్లను తొర్రూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా విద్యాశాఖాధికారులు స్పందించి ఈ ఘటనపై విచారణాధికారిగా మరిపెడ ఎంఈవో అనితాదేవిని నియమించగా, ఆమె పాఠశాలను సందర్శించి బాలికల నుంచి వివరాలు సేకరించింది. నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి అందజేయనున్నట్లు తెలిపారు. త్వరలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

# సమన్వయ లోపం.. ఎల్‌ఆర్‌ఎస్‌కు శాపం

- లక్షకు పైగా దరఖాస్తులు.. వందల్లో క్రమబద్ధీకరణ
- రెండు నెలలుగా ముందుకు సాగని ప్రక్రియ
- క్షేత్రస్థాయిలో పరిశీలించని మూడు శాఖల అధికారులు
- కోట్ల ఆదాయం తెచ్చే పథకాన్ని పట్టించుకోని బల్దియా
- ఇబ్బందులు పడుతున్న దరఖాస్తుదారులు




వరంగల్, జనవరి 29 : ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) గందరగోళంగా మారింది. బల్దియా, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయ లోపం ఎల్‌ఆర్‌ఎస్‌కు అడ్డంకిగా మారింది. కార్పొరేషన్‌కు కోట్లల్లో ఆదాయం తెచ్చి పెట్టే ఎల్‌ఆర్‌ఎస్ స్కీంపై బల్దియా అధికారులు దృష్టి సారించడం లేదు. రెండు నెలలుగా క్షేత్రస్థాయిలో ఒక్క దరఖాస్తు కుడా బల్దియా క్లియర్ చేయలేదు. గ్రేటర్ కార్పొరేషన్‌లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం లక్షకు పైగా దరఖాస్తులు రాగా, అందులో ఇప్పటి వరకు వందల్లో మాత్రమే అధికారులు క్లియర్ చేశారు. ప్రభుత్వం వివిధ పథకాలకు సంబంధించిన సర్వేలు చేయిస్తుండడంతో బల్దియా అధికారులు కోట్లాది రూపాయలు తెచ్చిపెట్టే ఎల్‌ఆర్‌ఎస్‌పై దృష్టి పెట్టడం లేదు. గత రెండు నెలలుగా దరఖాస్తుల క్లియరెన్స్‌ను అధికారులు పక్కన పెట్టారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను వేగవంతం చేయాలని కమిషనర్ నాలుగు సమీక్షలు నిర్వహించడం తప్ప చేసిందేమీ లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**సహకరించుకోని అధికారులు**

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్లియరెన్స్ బాధ్యతను మూడు శాఖలకు అప్పగించారు. లెవల్ 1లో మున్సిపల్, 2లో రెవెన్యూ, 3లో ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదిస్తేనే లెవల్ 4లో దరఖాస్తుదారుడు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మూడు లెవల్స్‌లో ఎక్కడ దరఖాస్తు ఆగిపోయినా క్రమబద్ధీకరణ కాదు. అయితే సమన్వయంతో ముందుకు సాగాల్సిన మూడు శాఖల అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. లెవల్ 1 పూర్తి చేసి పంపించిన దరఖాస్తులను లెవల్ 2లో పరిశీలించకపోవడంతో నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో దరఖాస్తుల క్లియరెన్స్ కోసం మూడు శాఖల్లో ప్రత్యేక అధికారులను నియమించాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

**కొన్నింటికే క్రమబద్ధీకరణ**

గ్రేటర్‌లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 1,01,339 దరఖాస్తులు వచ్చాయి. అందులో 6,628 లెవల్ 1 పూర్తి చేసుకొని 2కు వెళ్లాయి. వాటిలో 2,304 దరఖాస్తులను క్లియర్ చేశారు. ఇప్పటి వరకు కేవలం 280 మ్రాతమే అన్ని లెవల్స్ పూర్తి చేసుకొని క్రమబద్ధీకరణ జరుగగా, ఇంకా లక్షకు పైగా పెండింగ్‌లోనే ఉన్నాయి. అయితే గత నాలుగు నెలలుగా కొనసాగుతున్న ప్రక్రియలో కేవలం రూ. 36 లక్షల ఆదాయం మాత్రమే వచ్చింది. ఇప్పటికైనా అధికారులు ఎల్‌ఆర్‌ఎస్‌పై దృష్టి సారించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

# కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అసమర్థులు

- నర్సంపేటకు రూ. 75 కోట్లతో యాంత్రీకరణ పైలట్ ప్రాజెక్ట్
- గత బీఆర్‌ఎస్ హయాంలో రూ. 15 కోట్లు వినియోగించుకున్న రైతులు
- మిగిలిన రూ. 60 కోట్లు నిలుపుకోలేకపోయిన కాంగ్రెస్ నేతలు
- వాటితోనే ఇప్పడు రాష్ట్రమంతా పథకాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట, జనవరి 29 : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రూ. 75 కోట్లతో పైలట్ ప్రాజెక్టుగా నర్సంపేట నియోజకవర్గానికి తీసుకొచ్చిన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని నిలుపుకోలేని అసమర్థులు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం నర్సంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులో భాగంగా వ్యవసాయ పరికరాల కోసం రూ. 15 కోట్లను నియోజకవర్గ రైతులు వినియోగించుకున్నారన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత మిగిలిన రూ. 60 కోట్లు ఖర్చు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి, నర్సంపేట ఎమ్మెల్యేను కోరామన్నారు. వారి నుంచి ఎలాంటి స్పందన రాక ఆ నిధులు మురిగిపోవడం బాధాకరమన్నారు. తెలంగాణలో ఎక్కడాలేని విధంగా నియోజకవర్గంలోని 51 వేల మంది రైతులు 161 కంపెనీల యంత్రాలను కోల్పోవడం దురదృష్టకరమన్నారు. నియోజకవర్గానికి మంజూరైన రూ. 60 కోట్ల నిధులను ఖర్చు చేయలేని అసమర్థుల వల్ల వాటిని రాష్ట్ర వ్యాప్తంగా ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అప్పట్లో జిల్లా కలెక్టర్ నోడల్ అధికారిగా ఉండగా టెండర్లలో డీలర్లే కాకుండా తయారీ కంపెనీలు పాల్గొనేలా ఈ స్కీంను తీసుకువచ్చామన్నారు. 50 శాతం సబ్సిడీతో రైతులు వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రాష్ట్రమంతా తీసుకురావడం హర్షణీయమేనని, గతంలో ఈ స్కీం విధి విధానాలను అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు వాటినే అవలంబించడంపై ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. రూ. 60 కోట్లతో కాకుండా ఇంకా పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి రాష్ట్రమంతా ఈ స్కీంను అమలు చేయాలని బీఆర్‌ఎస్ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే గతంలో మంజూరైన రూ. 60 కోట్లతో నర్సంపేట నియోజకవర్గానికి ఈ పథకాన్ని మళ్లీ తీసుకురావాలని పెద్ది కోరారు.



కోడ్ అమల్లోకి వచ్చినా తిరుమలగిరిలో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# కాంగ్రెస్‌కు కోడ్ పట్టదా ?

**అభివృద్ధి పనులకు ఆ పార్టీ నాయకుల శంకుస్థాపన**

ఆత్మకూరు, జనవరి 29 : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రభుత్వం పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలను రద్దు చేసింది. బుధవారం అందుకు విరుద్ధంగా తిరుమలగిరి గ్రామంలో ప్రభుత్వ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆవిష్కరించారు. 9 గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శంకుస్థాపన చేయాల్సి ఉండగా, ఎన్నికల కోడ్ ఉండడం వల్ల కార్యక్రమాలను రద్దు చేశారు. తిరుమలగిరి గ్రామంలో మాత్రం కొంత మంది కాంగ్రెస్ నాయకులు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దీంతో ఈ నిధులు కాంగ్రెస్‌వా? లేక ప్రభుత్వానివా? అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ పాలనా అంటే ఇదేనా? అని మండి పడుతున్నారు.



వాజేడు మండలకేంద్రంలో సీఎం రేవంత్‌తో ఉన్న ఫ్లెక్సీని తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

హనుమకొండ, జనవరి 29 : నల్గొండ–వరంగల్–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఫిబ్రవరి 3న విడుదల చేయనున్నారు. నామినేషన్ దాఖలుకు చివరి తేదీ ఫిబ్రవరి 10, నామినేషన్ల పరిశీలన ఫిబ్రవరి 11, ఉపసంహరణకు గడువు 13, ఫిబ్రవరి 27 ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్, మార్చి 3న ఓట్లు లెక్కింపు ఉంటుంది. మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల ప్రక్రియ అంతా పూర్తవుతుంది. ఎమ్మెల్సీగా నర్సిరెడ్డి కొనసాగుతుండగా మార్చి 29తో పదవీ కాలం ముగియనున్నది. కాగా ఎమ్మెల్సీ ఎన్నిక కోసం హనుమకొండ జిల్లా పరిధిలో మొత్తం 15 పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. 5,098 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2,884, మహిళలు 2,214 మంది ఉన్నారు. వీరంతా ఫిబ్రవరి 27న ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అయితే ఓటరు నమోదు చేసుకొనేందుకు ఇంకా అవకాశం ఉన్నందున ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు తెలిపారు.